క్లుప్తంగా

శనీశ్వరస్వామికి విశేష పూజలు



స్వామివారికి హారతి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని శ్రీశనీశ్వరస్వామికి శనివారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనం తరం స్వామివారిని పలు పుష్పాలతో విశేషంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పాలకమండలి సభ్యులు, ఆలయ అధికారులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పింఛన్ల పంపిణీ

నాగలాపురం: మండలంలోని 19 పంచాయతీల్లో ఉన్న 5,461 మంది పింఛన్‌దారులకు జూలై ఒకటో తేదీ నుంచి సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీ చేస్తామని ఎంపీడీఓ పీఎంకే బాబు తెలిపారు. పింఛన్‌దారులకు పింఛన్ పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే రూ.3.70 కోట్లు ఖాతాలో జమ చేసినట్లు ఆయన తెలిపారు. ఒకటో తేదీ తప్పి పోయిన వారికి రెండో తేదీ ఇంటి వద్దకే వచ్చి పింఛన్ అందజేస్తామన్నారు.

బీసీ హాస్టల్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి



దరఖాస్తు ఫారాలను అందజేస్తున్న వార్డెన్ రామయ్య

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని బీసీ హాస్టల్ ప్రవేశం కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని వార్డెన్ రామయ్య తెలిపారు. శనివారం ఆయన విద్యార్థుల ప్రవేశానికి సంబంధించి దరఖాస్తు ఫారాలను తల్లిదండ్రులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ హాస్టల్‌లో ప్రవేశానికి ఇప్పటికే 30 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. హాస్టల్‌లో ప్రభుత్వం పలు సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆహార భద్రతా ప్రమాణాలు పాటించాలి

తిరుపతి అర్బన్: హోటల్స్, రెస్టారెంట్లు నిర్వహిస్తున్న వారు ఆహార భద్రతా ప్రమాణాలు తప్పకుండా పాటించాలని జిల్లా ఆహార భద్రతాధికారి మద్దిలేటి హెచ్చరించారు. ఆయన నేతృత్వంలో శనివారం తిరుపతిలోని పలు హోటల్స్, రెస్టారెంట్లలో తనిఖీలు నిర్వహించారు. ఆయనతోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

వర్సిటీలో స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ

తిరుపతి సిటీ: మహిళా వర్సిటీ కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో గత ఐదు రోజులుగా జరిగిన ఉపాధిపై స్కిల్ వర్క్ షాపు శనివారం ముగిసింది. ఈ వర్క్‌షాపులో విద్యార్థినులకు తమ అధ్యయనానికి సంబంధించిన సాంకేతిక నైపుణ్యం, సాఫ్ట్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్‌పై శిక్షణ నిచ్చారు. దీనికి డైరెక్టర్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రొఫెసర్ ఎం విద్యావతి, ఎం ఉషారాణి, అధ్యాపకులు హాజరై శిక్షణ పొందిన విద్యార్థినులకు ప్రశంసిస్తూ బహుమతులు అందజేశారు.

శ్రీమూలస్థానమ్మ హుండీ ఆదాయం రూ.5.16 లక్షలు

చంద్రగిరి: గ్రామ దేవత శ్రీమూలస్థాన ఎల్లమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.5,16,957లు వచ్చినట్లు ఆలయ ఈఓ రామకృష్ణారెడ్డి తెలిపారు. శనివారం ఆలయ ఆవరణలో మార్చి 27 నుంచి సోమవారం వరకు(94 రోజుల) వరకు వచ్చిన హుండీ ఆదాయాన్ని దేవదాయ ధర్మాదాయ శాఖ సీనియర్ అసిస్టెంటు దుర్గాప్రసాద్ పర్యవేక్షణలో లెక్కించారు. అదే విధంగా తిరుపతి రూరల్ మండలం కొత్తచెర్లోపల్లి గ్రామంలో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామివారి ఆలయ హుండీను లెక్కించారు. 94 రోజులకు గాను స్వామివారి హుండీలో రూ.1,19,440 ఆదాయం చేకూరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, రెవెన్యూ, పోలీసు శాఖ, సిబ్బంది పాల్గొన్నారు.

కాలువల్లో సిల్ట్ తొలగించండి

తిరుపతి తుడా: నగర వ్యాప్తంగా ప్రధాన కాలువల్లో పూడిక (సిల్ట్) తొలగించాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితి సింగ్ అధికారులను ఆదేశించారు. అధికారులతో కలిసి ఆమె శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన చేశారు. ప్రతి కాలువను శుభ్రం చేయాలని అధికారులకు సూచించారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ పారబోయవద్దని ఆమె విజ్ఞప్తి చేశారు. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువఅన్వేష్, చెంచయ్య పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసానికి మూలస్తంభం ప్రాచీన సాహిత్యం



శ్రీసిటీలో మాట్లాడుతున్న ప్రవచన కర్త గంగిసెటి లక్ష్మీనారాయణ

శ్రీసిటీ(సత్యవేడు): మన ప్రాచీన సాహిత్యం వ్యక్తిత్వ వికాసానికి మూల స్తంభం అని యువ ప్రవచన కర్త గంగిసెటి లక్ష్మీనారాయణ అన్నారు. శ్రీసిటీ ఆధ్యాత్మిక, సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో శనివారం సానిక బిజినెస్ సెంటర్లో నిర్వహించిన 'సంస్కృతాంధ్ర వాఙ్మయంలో వ్యక్తిత్వ వకాసం' అనే అంశంపై చేపట్టి కార్యక్రమం ఎంతగానో ఆకట్టుకుంది. యువ ప్రవచన కర్త గంగిసెటి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో వ్యక్తిత్వ వికాసాన్ని ఒక పాఠ్యాంశంగా పరిగణిస్తున్నారని, కానీ ప్రతి వ్యక్తి జీవనశైలిలో భాగంగా మన భారతీయ వేదాలు, పురాణాలు, కావ్యాల్లో అనేక అంశాలు వ్యక్తిత్వ వికాసంపై చాల గొప్పగా లిఖించి ఉన్నారని పేర్కొన్నారు. వ్యక్తిత్వ వికాసానికి మూల స్తంభం మన ప్రాచీన సాహిత్యంగా పేర్కొన్నారు. సనాతన విద్యావ్యవస్థ విలక్షతను ప్రస్తావిస్తూ, తైత్తిరీయ ఉపనిషత్తులోని శిక్షావళిలో పేర్కొన్నట్టు గురుశిష్య సంబంధాన్ని ఆయన సోదాహరంగా వివరించారు. గురువులు తమ విద్యార్థులను మంచిగా రాణించేలా ప్రోత్సహించేవారన్నారు. ఇందులో భాగంగానే «నిజం మాట్లాడండి, మీకర్తవాన్ని(ధర్మం) నిర్వర్తించడం.. మీ నిర్ణయాన్ని స్థిరంగా ఉంచండి అని సూచిస్తారని ఉద్బోదించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అతిథులను దేవతలుగా గౌరవించండి, అని గురువులు ఉద్బోదించేవారిని తెలిపారు. అనంతరం శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ ఆధ్యాత్మిక సాహిత్య వికాసానికి శ్రీవాణి వేదిక నిరంతరం పని చేస్తోందని తెలిపారు. డాక్టర్ లక్ష్మీనారాయణ వంటి పలువురు ప్రముఖ వక్తల ప్రసంగ కార్యక్రమాలను ఏర్పాటు చేయడం ద్వారా సమాజంలో స్ఫూర్తిని నింపేందుకు, విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ రమేష్‌కుమార్, శ్రీసిటీ ఉద్యోగులు, శ్రీసిటీ పీఆర్వో రవీంద్రనాథ్, విద్యార్థులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలి



బడిబయటి పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి బడిలో చేర్పిస్తున్న ఎంఈఓ రవి, ఉపాధ్యాయులు

సత్యవేడు: బడిఈడు పిల్లలందరినీ తప్పనిసరిగా పాఠశాలలో చేర్పించాలని ఎంఈఓ కే.రవి కోరారు. శనివారం సత్యవేడు పంచాయతీ పరిధిలోని వాటర్‌ట్యాంకు, దళవాయి అగ్రహారం గ్రామాల్లో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం భారతి ఆధ్వర్యంలో బడి బయటి పిల్లలు విజయశేఖర్(పదో తరగతి), సూర్య(తొమ్మిదో తరగతి), యామోష్(ఆరోతరగతి)ని గుర్తించి, తిరిగి బడిలో చేర్పించారు. అనంతరం బడి మానేసిన విద్యార్థుల తల్లిదండ్రులను కలసి పిల్లలను బడిలో చేర్పించాలని, చదువుకుంటేనే పిల్లలకు భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగేంద్రుడు, ఉపాధ్యాయలు మనోహర్, జనార్దన్, కే.సురేఖ, ఈ. రాజేష్, సీఆర్పీలు చెంగమ్మ, రామారావు, బాలకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలను పంపిణీ చేస్తున్న రిషితారెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలోని హరహరబావి పురపాలకసంఘ పాఠశాలలో శనివారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పురపాలకసంఘ కమిషనర్ రమేష్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీవరి సాగుపై రైతుల మొగ్గు



పల్లమాలలో యంత్రంతో వరినాట్లు వేస్తున్న రైతు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాంపాళెం, పల్లమాల, కాటూరు, కనమనంబేడు తదితర గ్రామాల్లో రైతులు యంత్రంతో శ్రీవరి సాగుపై మొగ్గు చూపుతున్నారు. కాంపాళెంలోని రైతులు 20 ఎకరాల్లో శ్రీవరి సాగు చేస్తున్నారు. శ్రీ వరి సాగుతో అధిక దిగుబడి సాధించవచ్చని రైతులు చెబుతున్నారు. వరి పంట సాగు సులభతరమైందన్నారు. రైతులకు కూలీల బెడద ఉండకపోవడంతో యంత్రంతో శ్రీ వరి పంటను వేయటానికి మక్కువ చూపుతున్నారు. ఇప్పటికే పల్లమాల, కారణి గ్రామాల్లో శ్రీవరిని రైతులు సాగుచేస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న వైద్యాధికారి దివాకర్

బుచ్చినాయుడుకండ్రిగ: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని వైద్యాధికారి దివాకర్ తెలిపారు. శనివారం ఆయన బుచ్చినాయుడుకండ్రిగ జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు, డయోరియాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో ముఖ్యంగా రెండు రకాల సీజనల్ వ్యాధులు ప్రబలుతాయని, అవి ఒకటి కలుషిత నీటి ద్వారా వచ్చే వ్యాధులు, రెండో దోమల ద్వారా వచ్చే వ్యాధులని చెప్పారు. కలుషిత నీరు, ఆహార పదార్థాలను తీసుకోవడంతో డయోరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులు వస్తాయన్నారు. దోమల ద్వారా మలేరియా, వైరల్ ఫీవర్, డెంగీ, చికెన్ గున్యా తదితర వ్యాధులు ప్రబలుతాయన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రతతోపాటు వ్యక్తిగత శుభ్రత పాటిస్తే కొంత వరకు వ్యాధులను అరికట్టవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం, ప్రధానోపాధ్యాయులు రమణయ్య, సీహెచ్‌ఓ వేంకటేశ్వరు, గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


అందరికీ పింఛన్ అందాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం: నియోజకవర్గంలోని ఏడు మండలాల్లోని పింఛన్‌దారులందరికీ జూలై నెల పింఛన్ అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సూచించారు. శనివారం నారాయణవనంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు తమ పార్టీ ఇచ్చిన హామీ మేరకు పెంచిన రూ.4 వేల పింఛన్‌తో పాటు, ఏప్రిల్ నుంచి జూన్ వరకు బకాయిలు మొత్తం కలిపి రూ.7 వేలను సోమవారం నుంచి ప్రభుత్వం అందిస్తుందన్నారు. అలాగే వికలాంగులకు రూ.6 వేలు, కేన్సర్, డయాలసిస్ రోగులకు రూ.10 వేలు, పడకలో ఉన్న రోగులకు రూ.15 వేలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. జూలై ఒకటో తేదీ ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సచివాలయం ఉద్యోగులు పింఛన్ అందజేయాలని సూచించారు. సమావేశంలో పార్టీ నాయకులు బాలరాజు, భక్తవత్సలం, భాస్కరన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఇంటి వద్దే పింఛన్ పంపిణీ





మాట్లాడుతున్న కమిషనర్ రమేష్‌బాబు, హాజరైన అధికారులు, సచివాలయ సిబ్బంది

శ్రీకాళహస్తి: మున్సిపల్ పరిధిలో అర్హులైన లబ్ధిదారు లందరికీ జూలై 1న సచివాలయ సిబ్బందిచే ఇంటి వద్దనే పింఛన్ పంపిణీ చేయనున్నట్లు కమిషనర్ రమేష్‌బాబు తెలిపారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఒక్కో లబ్ధిదారుడికి జూలైకు సంబంధించి రూ.4వేలు, ఏప్రిల్, మే, జూన్ నెలల బకాయిలు రూ.3 వేలు మొత్తం రూ.7 వేలు పింఛన్ మొత్తం ఇవ్వనున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు ఎవరూ కార్యాలయాల వద్దకు రావాల్సిన అవసరం లేదని సచివాలయ సిబ్బందే ఇంటి వద్దకు వచ్చి పింఛను సొమ్ము అందజేస్తారన్నారు. పింఛను పంపిణీని నోడల్ అధికారులు పర్యవేక్షిస్తారని తెలిపారు.

ప్రసన్నవెంకన్నకు ప్రత్యేక పూజలు



ప్రసన్న వేంకటేశ్వరస్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామివారికి శనివారం భక్తులు ఘనంగా పూజలు చేశారు. ఉదయం ప్రసన్న వేంకటేశ్వరస్వామివారికి అభిషేకాలు చేసి, విశేషాలంకరణ చేశారు. అనంతరం గ్రామస్తులు, భక్తులు భక్తి శ్రద్ధలతో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. తీర్థ, ప్రసాదాలను పంపిణీ చేశారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఉత్సవమూర్తులను ఊరేగించారు.

జాబ్‌కార్డుదారులందరికీ పనులు



కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ సరిత

ఏర్పేడు: ఉపాధి హామీలో జాబ్‌కార్డుదారులందరికీ పనులు కల్పించాలని అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సరిత అన్నారు. శనివారం మండలంలోని పల్లం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలీల మస్టర్‌లను తనిఖీ చేశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి దోహదపడే పనులను చేపట్టాలన్నారు. రైతుల పొలాల్లో నీటి గుంటలను ఏర్పాటు చేయాలని సూచించారు. దీంతో భూగర్భ జలాల మట్టం పెరుగుతుందని తెలిపారు. కూలీలకు రోజుకు రూ.300 వేతనం వచ్చేలా పనుల్లో కొలతలను ఇవ్వాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రైతుల పొలాల్లో మామిడి, పూలు, మునగ తోటల పెంపకానికి ప్రోత్సహించాలని తెలిపారు. ప్రతి పంచాయతీలో వంద మంది కూలీలు తగ్గకుండా పనులు చేసేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏపీఓ దేవరి, సాంకేతిక సహాయకుడు మనోహర్, క్షేత్ర సహాయకురాలు సుమలత పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం



కాలేజీలో అడ్మిషన్ ఇస్తున్న ప్రిన్సిపల్ రమణయ్య

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక జిల్లా పరిషత్ బాలికల జూనియర్ కళాశాల్లో ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ రమణయ్య తెలిపారు. శనివారం ఆయన పదో తరగతి ఉత్తీర్ణులైన బాలికలకు ఇంటర్‌లో ప్రవేశానికి సంబంధించి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ స్థానిక జిల్లాపరిషత్ బాలికల జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులను ప్రవేశపెట్టినట్లు చెప్పారు. పదో తరగతి పాసైన బాలికలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒక్కో గ్రూపునకు 40 సీట్లు ఉన్నాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సురేంద్ర, రఘువీర్, మార్టిన్, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి



తులసిరామ్‌రెడ్డి మృతదేహం

గంగాధర నెల్లూరు: మండలంలోని ఒడ్డుపల్లి వద్ద ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిసిన వివరాల మేరకు.. గంగాధరనెల్లూరు మండలం కోటగరం పంచాయతీ వడ్డుపల్లికి చెందిన కృష్ణారెడ్డి కుమారుడు తులసీరామ్ రెడ్డి (34) పొలం వద్ద నుంచి చెరువు కట్టపై ఆవులను పట్టుకుని ఇంటికి వస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన చిరంజీవి రెడ్డి చెరువు కట్టపై ట్రాక్టర్ నడుపుకుంటూ రాగా ఆవులు బెదిరిపోవడంతో చిరంజీవి రెడ్డి వాటిని తప్పించబోయి తులసీరామిరెడ్డిని ఢీకొట్టాడు. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. మృతుడి భార్య మౌనిక ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఏఎస్‌ఐ ఆంజనేయులు రెడ్డి తెలిపారు.

మాతాశిశు ఆరోగ్య సంరక్షణ చర్యలు



ఆరూరు హెల్త్‌సెంటర్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా టాక్స్‌ఫోర్సు టీమ్

సత్యవేడు: వైద్యసిబ్బంది మాతాశిశు సంరక్షణ చర్యలు చేపట్టాలని డాక్టర్ శ్రీనివాసరావు సూచించారు. శనివారం ఆరూరు పంచాయతీలోని హెల్త్ సెంటర్‌ను జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు పరిశీలించారు. తొలుత రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలతో సమావేశం నిర్వహించారు. డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ గర్భిణులకు మాతా సంరక్షణ కార్డులు తప్పని సరిగా ఇవ్వాలని, కార్డులో వారికి అందించే సేవల వివరాలు నమోదు చేయాలన్నారు. పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయాలని సూచించారు. గర్భిణులు క్రమం తప్పకుండా ప్రతి నెలా వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలు దోమతెరలు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్టాటికల్ ఆఫీసర్ సి.నాగేంద్రకుమార్, ప్రోగ్రాం ఆఫీసర్ పి.ప్రకాష్, ఇన్‌చార్జి ఆఫీసర్ ఏ.బేబిరాణి, పాండూరు పీహెచ్‌సీ డాక్టర్ వై.అనిత, సీహెచ్‌ఓ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా గణాంక దినోత్సవం



మాట్లాడుతున్న అధ్యాపకులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎస్వీయే ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో శనివారం జాతీయ గణాంక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీలత మాట్లాడుతూ జాతీయ గణాంక దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ నరసింహవర్మ, అధ్యాపకులు బాపనయ్య, సత్యనారాయణరెడ్డి, మునెయ్య, రాజేంద్రుడు, రవిప్రసాద్ పాల్గొన్నారు.

శ్రీవారి లడ్డూ నాణ్యత పెంపునకు చర్యలు



మాట్లాడుతున్న ఈవో శ్యామలారావు

తిరుపతి(అలిపిరి): శ్రీవారి లడ్డూ ప్రసాదాలు మరింత నాణ్యత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని టీటీడీ ఈవో శ్యామలారావు అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో శనివారం ఈవో కార్యాలయంలో టీటీడీ అధికారులు, డెయిరీ నిపుణులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ మరింత నాణ్యమైన నెయ్యిని ఎలా కొనుగోలు చేయాలి.. కొనుగోలు చేసిన నెయ్యి మరింత అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎలా పరీక్షించాలి తదితర అంశాలపై తెలియజేయాలని నిపుణులను కోరారు. లడ్డూ నాణ్యతను ప్రముఖ డెయిరీ నిపుణులు విజయభాస్కర్ రెడ్డి, సురేంద్రనాథ్ ఫుడ్ సేఫ్టీ అథారిటీ ఆఫ్ ఇండియా అగ్‌మార్క్, టీటీడీ నిబంధనల ప్రకారం నెయ్యి నాణ్యత ఎలా ఉండాలనే విషయమై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో వివరించారు. నాణ్యమైన నెయ్యి ప్రామాణిక విలువల గురించి తెలిపారు. త్వరలో లడ్డూ నాణ్యత మరింత పెంచడానికి అవసరమైన నెయ్యి సమకూర్చుకోవడానికి సమగ్ర నివేదిక సమర్పిస్తామన్నారు. సమావేశంలో జేఈవో గౌతమి, ఎస్వీ గోశాల డైరెక్టర్ హరినాథ్ రెడ్డి పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో 49 కేసులు పరిష్కారం



శ్రీకాళహస్తి: మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాసనాయక్

సత్యవేడు: స్థానిక కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 49 కేసులు పరిష్కరించి, రూ.17,89,626 రికవరీ చేసినట్లు పుత్తూరు అడిషనల్ సివిల్‌జడ్జి వి. గోపాలకృష్ణ తెలిపారు. సివిల్ 5, ఈపీ 2, క్రిమినల్ కేసులు 24, ఎక్సైజ్ 2, ఎన్‌ఐ యాక్టు, చెక్‌బౌన్సు, ఎంసీ కేసులు ఒక్కొక్కటి వంతున పరిష్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ, బ్యాంకు మేనేజర్, శ్రీసిటీ డీఎస్పీ, సత్యవేడు సీఐ, టెలిఫోన్ సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం

శ్రీకాళహస్తి: లోక్ అదాలత్‌లో ఇచ్చే తీర్పే తుది తీర్పు అని 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ అన్నారు. రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు శనివారం పట్టణంలోని కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో ఇచ్చే తీర్పు సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పుతో సమానమన్నారు. దీనికి తిరిగి అప్పీల్ లేదని తెలిపారు. అనంతరం లోక్ అదాలత్‌ను ప్రారంభించారు. పలు రకాల కేసులు 150కి గాను రూ.2,21,42,855 నగదును రికవరీ చేశారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు బేబీరాణి, ధర్మారావు, అన్నిశాఖల అధికారులు, బ్యాంకు సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



సత్యవేడు: లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న జడ్జి గోపాలకృష్ణ

ముక్కంటి ఆలయ ఈఓగా ఎన్‌వీఎస్ఎన్ మూర్తి



ఎన్‌వీఎస్ఎన్ మూర్తి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ముక్కంటి ఆలయ పుల్ అడిషనల్ చార్జ్ ఈఓగా ఎన్‌వీఎస్ఎన్ మూర్తి నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం దేవదాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఈఓగా పనిచేస్తున్న ఎస్వీ నాగేశ్వరరావు ఆదివారం పదవీ విరమణ చేయనున్నారు. దీంతో ముక్కంటి ఆలయ ఈఓగా తిరుపతి దేవదాయశాఖలో రీజనల్ జాయింట్ కమిషనర్‌గా పని చేస్తున్న ఎన్‌వీఎస్ఎన్ మూర్తిని నియమించారు. గత శివరాత్రి బ్రహ్మోత్సవాల సమయంలో ఈయన ప్రత్యేక అధికారిగా పనిచేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నారాయణవనం: వేగంగా వెళ్తున్న మోటార్ సైకిల్‌పై నుంచి అదుపు తప్పి ఓ యువకుడు కింద పడడంతో తలకు బలమైన గాయమై మృతిచెందిన ఘటన శనివారం రాత్రి నారాయణవనం మండలంలో చోటు చేసుకుంది. వివరాలు.. గేట్ పుత్తూరు చాకలి గుంటకు చెందిన నందకుమార్(18) తన స్నేహితులు విజయ్, గిరితో కలిసి మోటార్ సైకిల్‌పై నారాయణవనంకు వచ్చారు. అక్కడి నుంచి పుత్తూరుకు శనివారం రాత్రి 9 గంటల సమయంలో తిరిగి ప్రయాణమయ్యారు. మండలంలోని జాతీయ రహదారిపై వేదవ్యాస డిగ్రీ కళాశాల సమీపంలో వేగంగా వెళ్తున్న మోటార్‌సైకిల్ నుంచి వెనుక కూర్చొన్న నందకుమార్ ప్రమాదవశాత్తు జారి కిందపడడంతో తలకు బలమైన గాయమైంది. దీంతో అతన్ని పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ నందకుమార్ మృతిచెందాడు. ఈ ప్రమాదంపై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.